

# నిర్మాతలు

"ఏం ప్రొడ్యూసర్లు సార్! ఒక్కనికన్నా తెలివి లేదు. ఎంతసేపూ పైసల గురించిన ఆలోచననేగాని, పబ్లిక్ ఏమయిపోతది - అన్న సంగతే ఆలోచించరు..."

ప్రేయర్ అయిందప్పుడే. ఇంకా విద్యార్థులు పూర్తిగా తరగతి గదుల్లోకి వెళ్ళ లేదు. విద్యాకమిటీ చైర్మన్ ఆఫీసులో ప్రత్యక్షం!

అసలు ప్రభుత్వం ఏ ఉద్దేశ్యంతో ఈ కమిటీలను ఏర్పరచిందోగాని, విద్యను రాజకీయాలతో పూర్తిగా ముడివేసి, ఇక్కడకూడా ఆ రంగు రాజ్యమేలేలా చేయడం... ఇది విద్యార్థులకూ, విద్యకూ మేలు చేయదనే నా ఉద్దేశ్యం.

"ఏం హెడ్మాస్టర్ సాబ్! మాట్లాడవేంవయా?" నా మౌనాన్ని ఆదరించలేని చైర్మన్ నర్సింహారెడ్డి మందలింపు.

ఇదీ పరిస్థితి. ఓ పోస్టుగ్రాడ్యుయేట్ని, డాక్టరేట్ని, ప్యానెల్గ్రేడ్ ప్రధానోపాధ్యాయుడ్ని... పదిదాకా కూడా చదువుకోలేని, కేవలం రాజకీయ పలుకుబడి కల్గిన ఓ సామాన్యుడి మందలింపు. ఇంతకంటే భయంకరంగా వ్యవహరించే కమిటీలూ ఉన్నాయని విన్నాను. సమాధానం చెప్పలేక బలవంతంగా నవ్వు పులుముకున్నాను. అసలు బడికి, సినిమాలకీ, ప్రొడ్యూసర్లకీ, బిజినెస్సుకీ ఉన్న బాదరాయణ సంబంధమేమిటో, ఇంత పొద్దున్నే వచ్చిఆయనగారు ఈ సుప్రభాతం పలకడమేమిటో నాకర్థం కాలేదు.

"అదిగాదుసార్, ఈ వారం రిలీజైన సినిమాలు జూసిన్రా? ఒక్కటన్న... ఏ ఒక్కటన్నా మంచి మెసేజ్ ఇచ్చేదున్నదా?" సీరియస్గా రెడ్డి.

నాకు సినిమా పరిజ్ఞానం వానాకాలం చదువే. అలాగని మళ్ళీ మౌనం వహిస్తే అతను 'అపార్థసారథి' అయి ఈ రథాన్ని ఎక్కడెక్కడో లాక్కుపోతాడు. అందుకే గబుక్కున - "అది వ్యాపారం కదండీ!" అన్నాను తటస్థంగా. ఆపై అతను చెప్పేది వినసాగాను మౌనంగా - కోపిష్టి మాష్టారు క్లాసులో విద్యార్థుల్లా.

ఓ అరగంటసేపు సినిమాలు - నిర్మాతలు - బాధ్యతలు అనే అంశం మీద అనర్గళంగా ఉపన్యసించి, "సారీ! మీటైం వేస్ట్ చేస్తున్నట్టున్నా. మళ్ళ గలుస్త." అనే ఫినిషింగ్ టచ్ ఇచ్చి వెళ్ళాడు ఆదరాబాదరాగా.

గ్లాసెడు మంచినీళ్ళు తాగాను గడగడా.

వందయేళ్ళ చరిత్రగల్గిన వటవృక్షం లాంటి పాఠశాల మాది. సుమారు వేయిమంది విద్యార్థులు, ముప్పైరెండుమంది ఉపాధ్యాయులు....అన్నిటికీ మించి ఫలితాల్లో ఎప్పుడూ పైచేయిగా ఉండే మా పాఠశాల ఈ టౌన్లో ప్రైవేటు పాఠశాలల ఉనికిని సైతం సవాలు చేస్తుండటం - ప్రభుత్వ పాఠశాలలన్నీ గర్వించ దగ్గ అంశం. దానికి నేను ప్రధానోపాధ్యాయుడిగా రావడం నిజంగా నా అదృష్టమే.

ఇంతమంది విద్యార్థుల్ని, ఉపాధ్యాయుల్నీ, కమిటీమెంబర్లనీ - సమన్వయ పరుస్తూ నెట్టుకు రావడం కత్తిమీదసామే. అలవాటైంది. ఒడుపుచిక్కింది. కష్టమైనా అసాధ్యం మాత్రం కాదని అనుభవం చెబుతోంది. నా మటుకు నేను చాలా వరకు విజయం సాధించినట్టేలెక్క. చాలా రోజులుగా మా ఉపాధ్యాయుల బోధనల్ని గమనించాలనే కుతూహలం నన్ను కుదిపేస్తోంది. నెమ్మదిగా ఆఫీసులో నుండి కదిలాను.

హుసేన్‌సాగర్ చుట్టూ నెక్లెస్ రోడ్డులా ఉంటుంది మా పాఠశాల బిల్డింగు ఆఫీసులో నుండి బయటికెళ్ళి వరండాగుండా వెళ్తే వరుసగా అన్నిక్లాసులూ, స్టాఫ్ రూమ్, కంప్యూటర్ సెల్, లాబ్, లైబ్రరీ అన్నీ చుట్టేసి మళ్ళీ ఆఫీసులోకి చేరవచ్చు గుళ్ళో ప్రదక్షిణం చేస్తున్నట్టు మెల్లగా వామభాగం నుండి ముందుకు కదిలాను.

"అమ్మస్త్రీ......ఆలిస్త్రీ..... అమ్మలగన్న అమ్మస్త్రీ....ఆదిశక్తి అపరావతారం...." రెండో గ్రేడు తెలుగు పండితుడి గొంతులో నుండి శ్రీశ్రీ కవిత్వం భావావేశంతో జాలువారుతోంది. ఆరో తరగతి పక్కన నా అడుగులకు బ్రేకులుపడ్డాయి. ఆ క్లాసు తెలుగులో ఆ పాఠం లేకపోవచ్చు. కాని, ఆ కవిత్వంలోని బలం, మేష్టారు గానం నన్ను ఆకట్టుకున్నాయి. పిల్లలు నిశ్శబ్దంగా అది ఆస్వాదిస్తూండటం వాళ్ళ ఆసక్తిని చెప్పకనే చెబుతోంది.

"అదిరా కవిత్వమంటే! గుండెలోకి సూటిగా దూసుకొనిపోయి నెత్తురును మరిగిస్తుంది. నరాల్లో ఉప్పెనలా ఎగిసిపడి చైతన్యాన్ని రగిలిస్తుంది. అసలు పాఠాలన్నీ అలా ఉండాలి. 'తరువు - లతిరస - ఫలభార....' అంటే అది కవిత్వమో, పైత్యమో, సంస్కృతానికి మక్కీకి మక్కీ దించడమో అర్థంగాదు. నిజానికి ఈ పద్యాలనేవే అనవసరం. ఏ భాషలోనూ లేని వెర్రిమొర్రి ప్రయోగం మన తెలుగువాళ్ళే చేశారు. ఛందస్సు పేరుతో భావనా బలాన్ని నిర్వీర్యం చేశారు...." మేష్టారు రాజలింగం వ్యాఖ్యానం అలా హద్దూ అదుపూ లేకుండా సాగిపోతోంది.

అంతసేపూ అమృతం తాగుతున్నట్టనిపించిన అనుభూతి చేదుగా మారింది. పిల్లల పాలమనసుల్లో విషం ఎలా కలుషితమౌతోందో అర్థమవుతూంటే అసహనంగా ముందుకు కదిలాను. ఏడో తరగతిలో ఎమ్మెమ్ హుస్సేన్ హిందీ పాఠం చెబుతున్నాడు.

"మనది సెక్యులర్ దేశం. అంటే ఏ మతానికీ ప్రాధాన్యతలేని, మతాతీతమైన రాజ్యాంగం కల్గిన దేశమన్నమాట..." అతనెప్పుడూ సవ్యంగా పాఠం చెప్పడన్న 'టాక్' ఉంది. రోజూ పాఠం చెప్పేందుకు పుస్తకం తెరవడం, అందులో నాలుగు మాటలు చదవగానే ఓ మాట ప్రపంచాన్ని పరామర్శించేందుకు దొరుకుతుంది. ఇహ ఆ ప్రవాహంలో పడితే ఏ శక్తీ ఆపలేదు. ఈ రోజు ఈ సబ్జెక్ట్‌మీదికి ఎలా మళ్ళాడో తెలీదు. ఏం చెబుతాడో వినాలన్న ఆసక్తి పెరిగింది నాలో.

సెక్యులరిజం అనే ఆ ఒక్క మాటను పుచ్చుకొని చివరికి గుజరాత్ అల్లర్లదాకా వెళ్ళిపోయాడు. అక్కడ హిందూమతఛాందసుల ఘాతుకాలు అనే అంశం మీద ఊగిపోతున్నాడు.

ఆ తరగతిలో మిగతా క్లాసుల కంటే ముస్లిం విద్యార్థులు ఎక్కువే. అతను ఉద్దేశ్యపూర్వకంగానే చెబుతున్నాడో, యాదృచ్ఛికంగా ఆ సబ్జెక్టులో లీనమయ్యాడో కాని, దాని ప్రభావం గురించి తలచుకుంటూ, అనుకోకుండా రిస్ట్‌వాచ్ చూసుకున్నాను. ఇంటర్‌వెల్‌కి ఇంకా అయిదు నిముషాలుంది. ఆ పక్క క్లాసు 9వ తరగతి. ఈ పిరియడ్ మిసెస్ స్టాన్లీది. ఆమె సబ్జెక్టులో ఎప్పుడూ హండ్రెడ్ పర్సెంట్ రిజల్టే. అదీ చూసి వెనుదిరుగుదామని కదిలాను.

ఆమె పాఠం చెప్పడం పూర్తయ్యి ఉంటుంది. పిల్లలంతా ఏదో గుసగుసలాడుకుంటూన్నారు. నలుగురైదుగురు విద్యార్థులు ఆమె టేబుల్ చుట్టూ గుమిగూడి ఉన్నారు.

"సైలెన్స్!" గట్టిగా అరుస్తూ, బల్లమీద బెత్తంతో చరిచింది. నన్ను గమనించే ఈ పని చేసిందనడానికి ఆధారాల్లేవు. నేను వరండాలో నిలబడి బయటికి చూడసాగాను. చెవులు మాత్రం తరగతిలో జరిగే తతంగాన్ని రిసీవ్ చేసుకుంటున్నాయి.

"అరిస్టాటిల్ ఏ దేశస్థుడురా?" ఖంగుమంది నిశ్శబ్దంలో ఆమె గొంతు.

"భారతీయుడు టీచర్." ఎవరో ఒకరు 'గుంపులో గోవిందం' జవాబిచ్చారు.

"ఎవడ్రా ఆ గాడిద? అరిస్టాటిలంతటి గొప్ప వ్యక్తి మనదేశంలో ఎలా జన్మిస్తాడురా పిచ్చి సన్నాసీ! మనవాళ్ళు కందమూలాలు తింటూ, ఆకులలాలు మేస్తూ, కొండగుహల్లో బతుకులు వెళ్ళదీయడం నేర్చినవాళ్ళు. ఆధునికతను సంస్కృతి పేరుతో వ్యతిరేకిస్తూ, తిరోగమన వాదంతో పరుగులు తీసేవాళ్ళు, బండరాళ్ళకు మొక్కుతూ, పవిత్ర జలాలంటూ మురుగునీళ్ళలో స్నానాలు చేసే అజ్ఞానులు. అసలు ఇలాంటి దేశంలో పుట్టడమే దౌర్భాగ్యం! - ఇంకా చెప్పాలంటే..."

ఆవిడ ఇంకా ఏం చెప్పేదోకాని, ఇంటర్‌వెల్‌ను సూచిస్తూ బెల్‌మోగింది. నాకంతా అయోమయంగా, వెగటుగా అనిపించసాగింది. ఆ క్షణంలో సదరు టీచరుని చాచి లెంపకాయ కొట్టాలనిపించింది. ఏదో బాధ్యత, సహనం నన్నాపని చేయనివ్వలేదు. కాని భవిష్యత్ కార్యాచరణకి పునాదులు నా హృదయంలో రూపుదిద్దుకోసాగాయి.

ఇంటర్వెల్ తర్వాత క్లాసులవైపు వెళ్ళాలనిపించలేదు. ఓసారి గ్రౌండ్‌కి వెళ్తే మనసుకి ఆనందం, ఆహ్లాదం లభిస్తాయనిపించింది.

పీ.ఈ.టీ.నాజర్ పిల్లల్ని క్రికెట్ ఆడిస్తున్నాడు. గ్రౌండ్‌లో ఓ మూల వేపచెట్టు కింద కూర్చొని, అక్కడి నుండే సూచనలిస్తూ, మిగిలిన విద్యార్థుల్తో పిచ్చాపాటి మాట్లాడుతున్నాడు."

అతనంటే నాకు చాలా అభిమానం. పిల్లల్లో ఎంతగా కలిసిపోతాడో అంతగా క్రమశిక్షణలో ఉంచుతాడు. మా స్కూల్ వాలీబాల్‌లో స్టేట్‌లెవెల్ గుర్తింపు పొందిందంటే అది ఆయన గొప్పతనమే. ఆటలోనూ, మష్టారుతో మాటల్లోనూ లీనమైన పిల్లలు సడెన్‌గా నన్ను చూసి, ఠక్కున లేచి విష్ చేశారు. చిర్నవ్వుతో వాళ్ళను కూర్చోమన్నాను. వాళ్ళు కూర్చోలేదు.

ఎన్నేళ్ళయినా నాకీ క్రికెట్ మాత్రం అర్థమయ్యేలా లేదు. ఎందుకో అది 'ఫక్తు టైంవేస్ట్ గేమ్' అనే ముద్ర మనసులో పడిపోయింది. ఆ కారణంగానే గాబోలు ఆసక్తిలేదు, అర్థమూ కాదు. నాలో నేను నవ్వుకుంటూ వెనక్కి తిరిగాను.

"కూసోండిబే! యాడవడితే ఆడ ఎచ్చుం(హెచ్.ఎమ్.)ని జూస్తె లేసి నిలవడ్తరా? వానికేమన్న కొమ్ములున్నాయా? నాలుగు రోజులాగుండ్రి. ఈ కొడుకు తెలంగాణ ఎజిటేషన్లవడి, మంట-మంటంటాని ఉరుకుతడు...." నాజర్ నోటినుండి జాలువారిన వల్గారిటీకి ఒకరిద్దరు విద్యార్థులు కిసుక్కుమని నవ్వడం కూడా నా చెవులని తాకింది. అతనింత లజ్జారహితంగా మాట్లాడ్తాడని కలలో కూడా నేనూహించలేదు. నా తల్లిదండ్రుల సంగతి సరే, నేను ఈ నేల మీదనే పుట్టిపెరిగినోడ్ని. నా పట్ల మనసులో ఏదో కుళ్ళు నింపుకొని, విద్యార్థుల హృదయాల్లో లేనిపోని అపోహలు కల్గజేసి...ఛ!ఛ! ఆపై ఆలోచించలేకపోయాను. వికలమైన మనసుతో గబగబా ఆఫీసువైపు నడుస్తూ సడెన్‌గా ఆగిపోయాను.

పదోతరగతి ముందువరండాలో విద్యార్థులు కొందరు మోకాళ్ళమీద నిలబడి ఏదో చదువుతున్నారు. అందులో ఆడపిల్లలు కూడా ఉన్నారు. నన్ను చూసి ఇద్దరు లేచి నిలబడ్డారు. మిగతావాళ్ళు అలాగే (మోకాళ్ళమీదే) పక్కకు జరిగారు. నా దృష్టి సంధ్యమీద పడింది. ఆ అమ్మాయి అసలే తెలుపు. బాగా ఏడ్చినట్టుంది. కళ్లు ఉబ్బి, ఎర్రగా ఉన్నాయి. బుగ్గలూ ఎరుపెక్కి ఉన్నాయి ఎర్రగా. బహుశా దుఃఖం వల్లే అనుకున్నాను. కాని పరిశీలించి చూస్తే తెలిసింది, ఎడమ చెంపమీద అయ్యవారి చేతివేళ్ళ గుర్తులు.

"ఏమైంది?" నా ప్రశ్నలో లాలనతోపాటు ఎంక్వయిరీ.

సమాధానానికి బదులు కన్నీళ్ళు దూకాయి.

పిఈటీ మాటల్తో వేడెక్కి పోయివున్న నన్ను ఆ సన్నివేశం ఆవేశానికి లోనుజేసింది. మళ్ళీ ప్రశ్న రెట్టించేంతలో-

"తెలుగుసార్ సూత్రంలో ఓ పదం తప్పు చెప్పినందుకు కొట్టి బయటనిల బెట్టారు సార్!" కిరణ్మయి కల్పించుకొని చెప్పింది. ఆ సమాధానంలో ఆవేదన, పితూరి కలగలిసి ఉన్నాయి.

"ఏం సూత్రం?" ఆ ప్రశ్నెందుకేశానో నాకే అర్థం కాలేదు. నేను ప్రశాంతంగా లేనని చెప్పడానికి, తార్కాణంగా.

"తెలుగు సంధుల సూత్రాలు 10 కంఠస్థం చేసుకురమ్మన్నారు సార్. ఆమె ద్విరుక్తటకార సంధిసూత్రం సరిగ్గా చెప్పలేకపోయింది." ఠక్కున చెప్పింది మళ్ళీ.

అమానుషమనిపించింది. చిన్నప్పుడు ఆ సూత్రం కంఠస్థం చేయడానికి మేమెంత కష్టపడ్డామో గుర్తుకొచ్చింది. అయినా తప్పుచేస్తే, సమాధానం చెప్పకపోతే... ఇవేం శిక్షలు? పిల్లల వయస్సు, మిగతాపని, ఇంటినేపథ్యం, లింగభేదం ఇవన్నీ దృష్టిలో ఉంచుకోనవసరం లేదా? అందుకే పంతుళ్ళు పేపర్లలో పతాకశీర్షికల నలరిస్తున్నారు(చేయి విరిచిన పంతులు న్యూస్ నా స్మృతిలో మెదిలింది వెంటనే).

"శాస్త్రిగారూ!" నా గొంతులో కాఠిన్యం.

ఆ పిలుపుకోసమే ఎదురు చూస్తున్నట్టు రెండు అంగల్లో అక్కడికొచ్చాడాయన. నేనేదో అడగబోయేంతలో తనే అన్నాడు-

"చూడండి! మీరేదైనా మాట్లాడేదుంటే పీరియడ్ పూర్తయ్యాక నేనే ఆఫీసుకొస్తాను. అక్కడ మాట్లాడండి!"

అతను శాసిస్తున్నాడో, అభ్యర్థిస్తున్నాడో అర్థం కాలేదు. అతని సీనియారిటీపైన గౌరవమో, విద్యార్థుల ముందు ఒక ఉపాధ్యాయుడ్ని నిలదీయటం మంచిది కాదన్న సంస్కారమో నా గొంతును నొక్కేసింది. చరచరా ఆఫీసులో కొచ్చాను. ఎదురుగా బోసినవ్వులొలకబోస్తున్నాడు గాంధీజీ!

'షిట్' అనుకుంటూ ఎడమవైపు తిరిగాను. నిలువెత్తు ఫోటోలో డా. సర్వేపల్లి మందహాసం చేస్తున్నాడు.

'మీరు కలలుగన్న విద్యావిధానం, ఉపాధ్యాయవృత్తి ఎంతగా దిగజారుతున్నాయో చూశారా? నైతిక విద్య మృగ్యమవుతోంది, ప్రాంతీయతత్వం, మతతత్త్వం ఇక్కడా వేళ్ళూనుకుంటున్నాయి, జాతీయ భావాల ఊసేలేదు. దేశాన్నీ, భాషనూ

అగౌరవ పరుస్తున్నారు. కరుడుగట్టిన పాతవిధానాలు పట్టుకువేళ్ళాడుతున్నారు. ఆధునికత మోజులో ఈ దేశ ప్రాచీన సంస్కృతినే వెక్కిరిస్తున్నారు. వ్యక్తిగత వికృత భావజాలాన్ని విద్యార్థుల మనసు అద్దాలపై పూస్తున్నారు.....నో! ఇలా జరగడానికి వీల్లేదు. తలుచుకుంటే అసాధ్యంలేదు. ఈ కుళ్ళును కడగటానికి నావంతు ప్రయత్నం నేను ఇప్పటి నుండే మొదలుపెడ్తాను.....' అనుకుంటూ కుర్చీలో కూలబడ్డాను. అప్పుడు గుర్తొచ్చింది - రెడ్డిమాట.

"నిర్మాతలు సందేశాలివ్వలేకపోతున్నా'రని. అది వ్యాపారం. దాని మంచి - చెడులు పరిమితం, పారదర్శకం! కాని, మేం, భావిభారత నిర్మాతలం. చరిత్ర నిర్మాతలం. మా వ్యక్తిత్వాన్నీ, భావితరాన్నీ చిత్తశుద్ధితో దిద్దుకోకపోతే - మమ్మల్ని మేమే క్షమించుకోలేని రోజులొస్తాయి మరి.

(24-11-2003 జాగృతి సచిత్ర వారపత్రిక)